

# అమ్మా....

అక్కిరాజు హనుమంతరావు

‘‘మరొక్క మాట ఆలోచించరమా! ఏడాది నాగన్న! నిన్నొదిలి వాడుండగలడా?? ’’అనునయంగా అన్నారు మా మావఁగారు.

మా ఆవిడకొక్కసారి కోపంతోబాటు దుఃఖం కూడా వచ్చేసింది....“అటువంటప్పుడు మీరెందుకలా ఉత్తరం రాశారు? అసలు మీకు వాణ్ణుంచుకోడం యిష్టం లేదు....కాని - పోని ఆమదం మనకెందుకని ఆలోచిస్తున్నారు....” గబ గబా ఏదో అనేయబోయింది....మధ్యలోనే మా అత్తగారు అడ్డుతగిలింది.

''చాల్లేవే అమ్మాయి! నీ మాటలూ నువ్వూను!! మీ పది మందిని కని-పెంచిన చేతులివి. వాడు మాకాముడం ఎలాగవు తాడు?....కాకపోతే నీ కోసం బెంగపెట్టు కుంటాడేమోనని మా భయం! అంతే!!....''

''ఏం బెంగెట్టుకోడు. తొమ్మిదో నెల దాకా నీ చేతుల్లోనూ. పెద్దక్క దగ్గరే కదా వాడు పెరిగింది!! రెండ్రోజులు పోతే వాడికే మీదగ్గర చేరికవుతుంది....ఇదుగో! చూశావా....అప్పుడే నీ మీదికి ఎలా ఎగబడుతున్నాడో!!....'' అంటూ మా బుజ్జిగాణ్ణి వాళ్ళమ్మ చంకలోకి మార్చింది. విజయగర్వంగా నాకేసి చూస్తూ మా ఆవిడ-పైట సవరించుకుని.

అంతలో పైట చెంగుని చేతుల్లో నలుపుకుంటూ మా పెద్ద వదినగారు అంటే మా ఆవిడ పెద్దక్కగారే వచ్చింది వంటింట్లోంచి. ఆవిడకి చిన్నప్పుడే మొగుడు పోయాడు. అప్పట్నుంచీ పుట్టింట్లోనే వుంటూంది. మా ఆవిడంటే ప్రాణం ఆవిడకి!! పైగా పిల్లల్లేరు ఆమెకి.

''నీ కొడుక్కేం ఫరవాలేదు. పువ్వుల్లో పెట్టి చూసుకుంటాం!! నీకా భయం అక్కర్లేదు. హాయిగా వుండవే రమా....'' అంటూ పూర్తి భరోసా యిచ్చేసిందావిడ.

మా మావంగారు నాకేసి చూసి ''లాభం కాదు గురూ! మనకి డిపాజిటు గల్లంతు' అన్నట్టు చిరునవ్వు నవ్వారు. నేనూ బలవంతపు నవ్వొకటి నవ్వేసి వూరుకున్నాను. మర్నాడే నేనూ, మా ఆవిడ బుజిగాణ్ణి వాళ్ళ తాత, అమ్మమ్మల దగ్గర వదలి రైలెక్కాం....

ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంటులో నేనూ రమా తప్ప యింకెవ్వరూ లేరు. నా మనసు పూర్తిగా ఉల్లాసంగా వుంది. మా బుజ్జి [illegible] రావడం. నాకు మొదట్నుంచీ యిష్టం లేదు. [illegible] బయటికి చూస్తూ కూర్చున్నాను....చెట్లు, పుట్టలు, గుట్టలు, టెలిఫోన్ స్తంభాలు వెనక్కి పరిగెడుతున్నాయి....

''ఏమండీ....'' మా ఆవిడ భుజం

---

**అమ్మ**—ప్రతీ పసిప్రాణి తొలిసారిగా పలికే శబ్దం.

అమ్మలేని నాడు పశువులైనా మనుష్యులైనా అనాధలే!

---

మీద చెయ్యి వేసి కుదిపింది....ఉలిక్కి పడ్డాను.

"మీకు కోపం వచ్చింది కదూ...."

"అబ్బే....నాకోపం ఎందుకూ?...." సర్దుకోబోయాను.

"కాయ్యకండీ!....వో పీ....మీకు చాలా బాధగా వుంది. అవునా!?...."

నేను మాట్లాడలేదు.

మా ఆవిడ నా తొడ మీద తల పెట్టుకుని సర్దుకుని పడుకుంటూ అంది.

"నాకు మాత్రం లేదనుకుంటున్నారా వాడి మీద?....అయినా యిదొక చిన్న ఎక్స్పెరిమెంటు....చూద్దాం...." అంటూ కళ్ళు మూసుకు పడుకుంది.

ఏదో స్టేషన్లో రైలాగింది. ఎవరేనా ఎక్కితే బాగుండదేమోనని పక్కనున్న దిండు మీదకి మా ఆవిడ తల మార్చి, నా తొడ తప్పించాను. ఎవ్వరూ ఎక్కలేదు మా కంపార్టుమెంటులోకి.

రైలు మళ్ళా బయల్దేరింది....

ఇందాకట్నుంచి మా ఆవిడ తలపెట్టడం మూలంగా గాబోలు కాళ్ళంతా తిమ్మిరెక్కింది. ఒక్కసారి లేచి కాళ్ళు గట్టిగా జాడించి, మళ్ళా కూర్చున్నాను. కళ్ళు మూసుకుని కాసేపు నిద్రపోడానికి ప్రయత్నించాను....లాభం లేకపోయింది! మా ఆవిడ మాత్రం హాయిగా నిద్రపోతోంది. తనకేసే చూస్తూ కూర్చున్నాను. ఒక రకంగా తనని చూస్తే జాలేసింది. అలా ఆదమరచి పడుకుని ఎన్ని రోజులైందో!! బుజ్జిగాడి మూలంగా తనకి రోజూ రాత్రి నిద్ర సరిగా వుండేది కాదు....రెండు మూడు సార్లయినా దీస్టర్బవుతూ వుండేది. ఆ తర్వాత నిద్ర పట్టడం లేదో అని గోల పెట్టేది.

ఒక్కసారిగా రివ్వుమంటూ గాలి లోపలికి దూసుకుని వచ్చింది. ఆ తాకిడికి మా ఆవిడ పైట పూర్తిగా ప్రక్కకి తొలగింది. ఉఛ్వాస నిశ్వాసాలకామె వక్షస్థలం వింతగా కదులుతోంది. నా వొళ్లొక్కసారి ఝల్లుమంది ఎందుకో....మా ఆవిడ నిద్రలోనే పైట సరిచేసుకుని వత్తిగిలి పడుకుంది మళ్ళీ....మరో సందర్భంలో ఐతే నేనేం చేసేవాణ్ణో గాని, ప్రస్తుతానికి నా మనస్థితి అంత బాగుండక పోవడంతో మళ్ళీ దృష్టి బయటికి సారించాను.

మళ్ళీ వెనక్కి పోతున్న ఎలక్ట్రిక్ స్థంభాలు, చెట్లు, పుట్టలు, గుట్టలు....


* * *

అవి మా కొత్తగా పెళ్ళయిన రోజులు....

ఒక రోజు రాత్రి మా ఆవిడ అంది. "చూడండి! మీరేమీ అనుకోనంటే ఒక్క మాట...."

"ఏమిటది?' అన్నా! గోముగా మా ఆవిడ వీపు నిమురుతూ.

"మనం యిలాగే కొన్నాళ్లు హాయిగా,



ఫ్రీగా వుండాలంటే మనకే బాదర బందీ వుండకూడదు. మనిద్దరమే....''

''మనమిద్దరమేగా యిప్పుడున్నది?''

''అదే! మూడో వ్యక్తి అప్పుడే మన మధ్యకి రాకూడదు....''

''అంటే? మా అమ్మా, వాళ్ళూ మా వూళ్ళోనేగా వున్నదీ? వాళ్ళు మనం రమ్మన్నా రారు.''

''అబ్బ....వాళ్ళు కాదండీ! మూడో మనిషి అంటే వాళ్ళనేనా మీకర్థమయింది? మరేం తట్టడం లేదూ?....'' కిలకిలా నవ్వింది మా ఆవిడ జారిపోయిన పమిట సరి చేసుకుంటూ.

''ఓహో....అదా! మనం కొన్నాళ్ళదాటు ఫామిలీ ప్లానింగు అమలు జరపాలంటావు....అంతేనా?'' అన్నాను నవ్వుతూ.

''కరెక్ట్!'' అంది మా ఆవిడ మళ్ళీ నా దగ్గరగా జరిగి.

అప్పటినుంచీ తెలిసినంతవరకు మా జాగ్రత్తలో మేం వున్నా, అదేం చిత్రమో గాని అర్నెల్లు తిరక్కుండా మా ఆవిడ కాస్తా 'న్యూ ఎంట్రీ' సిగ్నల్ చూపించేసింది. ఒక వారం రోజులు నా మీద కారాలు, మిరియాలూ నూరి పారేసింది. తనని సమాధానపర చేసరికి నా తలప్రాణం తోకకి వచ్చింది.

''చూడు రమా....ఎవరికేనా సరే! పిల్లలు పుడితే ముప్పయ్యేళ్ళు లోపునే పుట్టేయాలి. తలిదండ్రులకి నలభై ఐదు-ఎభై ఏళ్ళు వచ్చేసరికి. మగవాళ్ళయితే

వాళ్ళ ఎడ్యుకేషను, ఆడపిల్ల యితే పెళ్ళి వగైరాలు పూర్తి చేసెయ్యాలి. వృద్ధాప్యంలో పిల్లల బెడద తల్లిదండ్రులకు వుండకూడదు. కాని పక్షంలో నానా యిబ్బందీను....'' అని ఎన్నో రకాలుగా మా ఆవిణ్ణి వొప్పించి, లాలించి, ప్రసన్నురాలిని చేసుకునేసరికి నా తలప్రాణం తోకకొచ్చింది.

ఆ తర్వాత మా ఆవిడకి మగపిల్లవాడు పుట్టడం, ఆరవ నెలలో మా యింటికి మళ్ళీ తీసుకు రావడం జరిగింది. తాత, అమ్మమ్మల దగ్గర అతి గారాబంగా పెరిగిన మా వాడు మా పాలిటి ఏకు మేకై కూర్చున్నాడు. కొన్నాళ్ళపాటు సాయంగా వుండడానికి మా పెద్ద వదినగారు వస్తానన్నా మా ఆవిడొప్పుకోలేదు 'పరవాలేదు నా కలవాటవాలి' అంటూ ఎవర్నీ రానివ్వలేదు. మా మధ్యకి మూడో వ్యక్తి రావడం తనకి మొదట్నుంచీ యిష్టంలేదు. చంటివాడు.... తప్పక సరిపెట్టుకుంది. ఇక మా బుజ్జిగాడి సంగతి....ఇరవై నాలుగ్గంటలూ వాణ్ణి ఎవరో ఒకరు ఎత్తుకునే వుండాలి. క్రింద పడుకోబెడితే వాడికి పాపం బోర్డు అనీజీగా వుంటుంది. వెంటనే యిల్లెగిరిపోయేలా సంగీతం మొదలెడతాడు. సినిమాకెళ్తే యింటికొచ్చేదాకా నోరు ముయ్యడు. ఎవరింటికేనా వెళ్తే కొత్త ముఖాలు చూసి గోల గోల. షికారుకెళ్తే మా ఆవిడ చీర రెండు సార్లేనా పాడు చేస్తేగాని వాడికి తృప్తిగా వుండదు... ఇక రాత్రిళ్ళ సంగతి సరే సరి. మా ఆవిడ వాడి వేపునుంచి మరో వేపు పత్తిగిలిందా రాగం అంకించుకుంటాడు.... ఎప్పటికప్పుడు మా ఆవిడ నన్ను నమిలి మింగేసేలా చూసేది-యిదంతా మీ మూలంగానే నన్నట్టు. నా మటుకు నాకు వాణ్ణి సముదాయిద్దామనే ఆశ.... కాని ఏం చెయ్యను? వాడు పూర్తిగా అమ్మ కొడుకు. నా పొడ కిట్టదు. అధవా రెండు నిముషాలున్నా వాళ్ళమ్మ కనిపించగానే నాకు విడాకులిచ్చేస్తాడు....

ఇలా మా వాడు మాకు, ముఖ్యంగా

లాయర్

● తాను చెప్పేదంతా నిజమనుకునే వ్యక్తి.

(నల్లకోటు ధరించి కాసేపు చెట్టు క్రింద దమ్ముకొట్టి కోటు గాలిలో రెపరెపలాడేట్లు ఒక్క దూకులో జడ్జిగారి ముందుకు గెంతి బల్ల గుద్దిందే గుద్దుతూ క్లయింటూ జడ్జిగారు పరిసర వాతావరణంకు తాను చెబుతున్నది పచ్చినిజం (అంతా అబద్ధమయినా)గా నిరూపించేందుకు ప్రయత్నించేలాడిగ్రీహోల్డర్.)

మా ఆవిడకి పెద్ద ప్రోబ్లమై కూర్చున్నాడు. "ఒక సినిమా లేదు, సరదాలేదు పాడు...." అంటూ తెగబాధపడేది. చుట్టు ప్రక్కల వాళ్ళతో ఒకటి రెండు సార్లంది సానుభూతి కోసం .... "చూడండి! వీడు నా ప్రాణాలు తోడేస్తున్నాడు...." అని.

"చంటి పిల్లలన్నాక అంతే మహా మరి... ఏం చేస్తాం...." అని వాళ్ళనే సరికి మా ఆవిడ రివ్వుమని లోపలికొచ్చి, ఏడేమని తలుపు వేసేసింది. ఇలా .. మరో ఆర్నెలు గడిచాయి మా వాడికి కొంచెం నడక వస్తోంది....మాటలు మాత్రం రాలేదింకా....'అమ్మా' అని మాత్రం అంటం వచ్చింది. నా దగ్గరకుకూడా రావడం మొదలెట్టాడు యిదివరకటి కంటె కాస్త నయం! యింతలో మా ఆవిడికి బ్రహ్మాండమైన ఐడియా వచ్చింది! మా వాణ్ణి వాళ్ళ పుట్టింటి దగ్గర వదిలేసివస్తే ఎలా వుంటుందని!! ఆ ఐడియా కాస్తా ఇంతై, అంతై ఆఖరికి, మహమ్మారిలా మా ఆవిడ బుర్రని పూర్తిగా ఆక్రమించుకుంది .. నిజం చెప్పొద్దూ! నాకు మాత్రం వాడి నక్కుత వొదలడం యిష్టంలేదు. ఏడాది పసివాణ్ణి తల్లినుంచి వేరు చెయ్యడమంటే నా కెందుకో చాలా బాధనిపించింది .. కాని అలాగని మా ఆవిణ్ణి సమాధానపరచడం కూడా చాలా కష్టమే! పైగా, తనను ఉన్నది-మంచయినా, చెడ్డయినా ఆక్షరాలా అమలు జరిపే నిక్షా ఇందిరా గాంధీలా చస్తే విడిపోదు మా ఆవిడ!! ... తప్పించుకోడానికి మరో మార్గంలేక "మీ వాళ్ళకు రాసి చూడు! ఏమంటారో!' అన్నా ఆఖరికి.

"వాడు బెంగెట్టుకోని పక్షంలో మాకేం అభ్యంతరము లేదు.... అలాగే వుంచుకుంటాం... " అని మావంగారె ఉత్తరం రాశారు.

పర్యవసానం....యీ ప్రయాణం.

* * *

రైలు గంటన్నర లేటుతో మా వూరు

జడ్జి

● తాను వినేదంతా అబద్ధం అనుకొనే మహాశయుడు
(అడ్వొకేటులు అబద్ధమాడుతున్నప్పుడు 'ఆర్డర్... ఆర్డర్' అని హెచ్చరిస్తూ (ఈయన లాయరుగా చాలా అబద్ధాలు ఆడివుంటారు) ఎక్కువ అబద్ధాలు వినేటప్పుడు చూడలేక (కోర్టుకు కళ్ళు లేవంటారు ఇదే) చెవులతో వింటూ లాయర్స్ (లయ్యర్స్) వైపు సన్నని మందహాసంతో తిలకించి వారి వాదాన్ని నిరాకరించే న్యాయాధిపతి)

చేరేసరికి రాత్రి తొమ్మిది గంటలైంది. అప్పుడు యింటికెళ్ళి ఏం తంటాలు పడతామని హోటల్లో భోంచేసి యిల్లు చేరుకున్నాం.... ఆ కబురూ, ఈ కబురు చెప్పుకుంటూ తాత్కాలికంగా మా బుజ్జిగాణ్ణి మర్చిపోయి, ఉత్సాహంగా యింటికొచ్చినా, మళ్ళీ పడుకోబోయే వేళకి మాత్రం ప్రసక్తి రానే వచ్చింది.

ఒళ్ళు మూసుకుని అన్యమనస్కంగా చెరో వేపూ వొత్తిగిలి పడుకున్నాం. నాకు కొద్దిసేపట్లోనే నిద్రపట్టేసింది.

"అమ్మా!...."

ఉలికి పడిలేచాను. ఎవరిదో పిలుపు!! అదోక రకమయిన బొంగురు కంఠం!

టైము చూశాను....

ఒంటిగంట!!!

"అమ్మా....!!" మళ్ళీ అదే పిలుపు! అదే కంఠం!! హృదయ విదారకంగా వుందా పిలుపు. ఒక్కసారిగా వొళ్ళు జలదరించింది.... నెమ్మదిగా లేచి లైటు వేశాను....

యింతలో మా ఆవిడ కూడా లేచింది. "ఏమిటండీ? ఏం జరిగిందీ?" అంటూ....

"ఎవరో!!!? అమ్మా... అమ్మా" అని రోదిస్తున్నట్టుగా... అదొకలాంటి కంఠం! బొంగురుగా, భయంకరంగా దిగులుగా వుంది....

మా ఆవిడ భయంగా నా కేసి చూసింది.

"ఒక వేళ మీరు భ్రమపడ్డారేమోనండీ! బుజ్జిగాణ్ణి వొదిలివచ్చిన దగ్గర్నుంచి మీరదోలా వున్నారు. వాడలాగే 'అమ్మా....' అంటూ వుంటాడు.... ఆ ధ్యాసలో మీరు... '

"అమ్మా... అమ్మా" అదే బొంగురు కంఠం!! హృదయవిదారకంగా, గుండెలు పిండేలా ..తల్లికోసం విలవిల్లాడి పోయే కంఠం!!! ఈ సారి ఆశ్చర్యపోయి, ఉలిక్కిపట్టం మా ఆవిడ వంతయింది.

గభాల్ని నా దగ్గరగా వచ్చి నా చెయ్యి పట్టుకుంది.

"ఏమండీ!! ఎవరిదా పిలుపు? ఏమిటిది??...." అంది ఆందోళనగా. తన చెయ్యి వొణుకుతోంది. నుదురంతా స్వేద బిందువులు ఆవరించుకున్నాయి.

"పద.... చూద్దాం...." అంటూ బయటికి రాబోయాను.

"వొద్దండీ.... నాకేదో భయంగా వుంది...." మా ఆవిడ చెయ్యి మరింత బిగుసుకుంది.

"మరేం ఫరవాలేదు.... చూద్దాం పద!" అన్నాను మొండిగా.

బయట లైటు వేసి అరుగు మీద కొచ్చాం.

రోడ్డు నిర్మానుష్యంగా వుంది. గేటు తలుపు తీసి బయటికి చూశాను. మళ్ళీ గేటు తలుపు వేసి మా యింటికి ప్రహరీ

గోడకి మధ్య వున్న రెండు సందులు పరికించి చూశాను. చీకటి తప్ప ఏమీ కనిపించలేదు....మా ఆవిడ అరుగు మీదే ప్రాణాలు బిగి బట్టుకుని నుంచుంది.

"ఎవ్వరూ లేరు ..." పొడిగా అన్నా అరుగెక్కుతూ.


"అమ్మా..." తృళ్ళి పడ్డాం ఇద్దరమూను. వెనక్కి తిరిగాను. మా ఆవిడ నన్నొక్క కుదుపు కుదుపుతూ "ఏవండీ! అదుగో! ఆ చావడిలోంచండీ...." అంది మా యింటి ఎదురుగా వున్న గొడ్లచావడి చూపిస్తూ.

మా యింటి ఎదురుగా ఠికామీగా వున్న ఖాళీ స్థలంలో కృష్ణ అనే కేరళ అతను హోటలు పెట్టి నడుపుతున్నాడు హోటలు పాకయినా కాలేజి ప్రక్కనుండడంతో కాలేజి స్టూడెంట్సు, ప్రక్కనే వున్న యిన్‌కంటాక్సు ఆఫీసు వాళ్ళతోనూ, అడపా దడపా వచ్చే రోడ్డుమీద జనంతోనూ అతని హోటలు బాగానే నడుస్తోంది. పాలవాళ్ళ బాధపడలేక అతనొక ఆవుని, గేదెని కొని, కాంటిన్ పక్కనే మరొక పాక వేశాడు వాటికోసం........ యీ అర్ధరాత్రి హృదయ విదారకమైన పిలుపు ఆ పాక లోంచే!!

"రమా! బ్యాటరీ లైటు పట్రా"....అన్నా ఆదుర్దాగా.

బ్యాటరీ లైటు వేసి, మా ఆవిడ, నేను కంచె తప్పించి పాక దగ్గరకు వెళ్ళాం లైటు లోపలికి సారించాను— నలువైపులా. గేదె తాపీగా నెమరువేస్తూ మా కేసి కాస్త సీరియస్‌గానే చూసింది. యిసకల ప్రక్క మూలగా ముడుచుకుని పడుకున్న చిన్న ఆవు దూడ లైటు చూసి బెదురుతూ లేవబోయి మళ్ళీ పడిపోయింది.

"అమ్మా"....అంది బాధగా లైటు వెలుగులో దానికళ్ళు చమక్‌మని మెరిశాయి కన్నీటిచారికలు స్పష్టంగా అవుపిస్తున్నాయి చుట్టూ చూస్తూ. 'అమ్మా....' అంది. మళ్ళీ, ఇద్దరం గాఢంగా నిట్టూర్చాం! మా ఆవిడ నా భుజం నొక్కుతూ.... "తల్లి కోసమండీ .... వెర్రి ముండ...." అంది

చుట్టూ చూశాం! తల్లి ఆవు కనిపించ లేదు....

కృష్ణ గుర్రు స్పష్టంగా వినిపిస్తోంది.

"సర్లే....ప్రొద్దున కనుక్కుందాం.... నడు!" అంటూ ముందుకు దారి తీశాను

గాఢంగా నిట్టూరుస్తూ భారంగా కదిలింది మా ఆవిడ

లైటార్పి పక్కమీద కళ్ళు మూసుకున్నాను. తను పడుకోలేదు. కూర్చుని ఆలోచిస్తోంది దీర్ఘంగా

"రెండవుతోంది.. పడుకో రమా!" అన్నా

"అది సరే కాని....ఏమండీ! బుజ్జిగాడిప్పుడేం చేస్తుంటాడంటారు?" అంది దిగులుగా.

"ఏం చేస్తాడు? అమ్మమ్మ దగ్గరో. పెద్దమ్మ దగ్గరో వెచ్చగా పడుకునుంటాడు.."

"అది కాదండీ! వాడు రాత్రి రెండు-మూడు సార్లు లేస్తాడు, నేను లేవకపోతే, 'అమ్మా-అమ్మా' అని పిలుస్తాడు. లేచి పాలు పట్టగానే కాసేపు గొడవ చేసి పడుకుంటాడు...వాడి పిలుపు వాళ్ళకి వినిపించి లేస్తారో లేదో!! మా అమ్మకసలే మొద్దు నిద్ర! మా అక్కయ్య పగలు చేసి చేసి వుంటుంది! దానికి పడుకుంటే మరి మెలకువ రాదు...." అంది బెంగగా.

"సర్లే! లేవకపోతే మన ప్రబుద్ధుడూరుకుంటాడా? వాళ్లే పడతారు! పడుకుందూ!" అన్నా. విసుగ్గా మరో వైపుకి వత్తిగిలి పడుకుంటూ.

"అవుననుకోండి! వాళ్ళే పడతారు! ఎందుకు పట్టరూ..." తనలో తనే అనుకుంటూ,

పడుకుంది... పడుకుందన్న మాటే గాని నిద్ర పోలేదు. అటూ-ఇటూ దొర్లుతూనే వుంది.


నాలుగ్గంటలు కొట్టేదాకా నాకూ నిద్ర పట్టలేదు. అరగంటకొకసారి బయటినుంచి 'అమ్మా....' అని పిలుపు మా ఆవిడ ఉలిక్కి పడ్డం నేను గమనిస్తూ వున్నాను. ఆ తరువాత ఆ పిలుపు మరి వినిపించలేదు. కారణం....నాక్కూడా గాఢంగా నిద్ర పట్టేసింది.

* * *

మా ఆవిడ గట్టిగా తట్టి లేపుతుంటే మెలకువ వచ్చింది. టైము చూశాను... ఎనిమిది గంటలైంది!! మా ఆవిడకేసి చూసి విభ్రాంత పోయాను....అప్పుడే నీట్‌గా తయారై ఎక్కడికో ప్రయాణానికి సిద్ధంగా వుంది!!

"త్వరగా లేవండి! ప్లీజ్....ఆలశ్యం చెయ్యద్దు! తొమ్మిదింబావుకి మెయిల్లో మా వాళ్ళింటికి వెళ్ళాలి...." అంది పక్క గదిలోకి దారి తీస్తూ.

"అదేమిటి రమా! నీకేమయినా మతి



పోయిందా? ఇప్పుడిక్కడికెందుకు? నిన్న నేగా వచ్చింది! పైగా యివాళ సెలవు కూడా కాదు...'' అన్నాను అయోమయంగా.

"సెలవు లేకపోతే రాపి పక్కాయన చేత పంపించండి! లేదా, నేనొక్కర్తినీ వెళ్ళొచ్చేస్తాను. బుచ్చిగాడు మా తం అక్కడుండడానికి వీల్లేదు. ప్లీజ్.... ఏవండీ! త్వరగా తెమలండి....ప్లీజ్.. '' ఖాప్కిన్ చీర, బ్లౌజు బాగ్‌లో పెడుతూ వొస్తున్న దుఃఖాన్ని క్రింది పెదవితో ఆపుకుంటూ, కళ్ళ నిండా నీళ్ళతో నాకేసి చూస్తూ దీనంగా అంది మా ఆవిడ.

ఇక ప్రశ్నించదల్చుకోలేదు నేను.

క్రిష్ణ కాంటిన్‌లో పనిచేసే కుర్రాణ్ణి అడిగాను. ఆదరా బాదరాగా దొడ్లో పళ్ళు తోముకుంటూ 'ఆవు ఏమయింద'ని! వాడు రోజూ మా కుళాయి నుంచి మంచినీళ్ళు పట్టుకెళ్తూ వుంటాడు.

''మొన్న మంచి బేరం వొస్తే దూర నుంచి ఆవునమ్మేశాడండి కిట్టు....'' అని హడావుడిగా వెళ్ళిపోయాడు వాడు.

మా ఆవిడ రిక్షాలో కూర్చుంది!

ఇంటికి తాళం వేసి రిక్షా ఎక్కుతుంటే దూడని భుజాన వేసుకుని పొలంలోంచి ఎదురొచ్చాడు కాంగ్రెస్ పనివాడొకడు! ఒక్క క్షణం నిర్ఘాంత పోయాను దాని తల నిర్జీవంగా వెనక్కి వేళ్ళాడుతోంది

"రమా! ఆ దూడ...''

''నాకు తెలుసు! మీరేం చెప్పక్కరలేదు....'' అంటూ జేబురుమాలు నోటికడ్డం పెట్టుకుని, కళ్ళు రెండూ మూసుకుని ముఖం దించుకుంది మా ఆవిడ.

రిక్షాలో కూర్చుని ''పోనీవోయ్ ...'' అన్నా.

స్టేషనుకేసి దూసుకుంటూ పోయింది మా రిక్షా. ✻